క్లుప్తంగా

గ్రామస్తుల చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

మోతె : మండల పరిధిలోని రాంపురంతండాకు చెందిన ఓర్సు రాయుడు– దేవి దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో వారి ముగ్గురు పిల్లలు, ఓ వృద్ధురాలు అనాథలయ్యారు. కాగా రాంపురంతండా గ్రామస్తులంతా కలిసి రూ.72, 650లను సేకరించి బుధవారం రాయుడు –దేవి పిల్లల పేరుమీద ఏపీజీవీబీ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి అండగా నిలిచారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగునాయక్, మహేందర్, కొర్ర దేవేందర్, మోహన్, నాగు, రాములు, వెంకన్న, సాజ్య, లకుముడు, సురేందర్, శోభన్, రాంబాబు, ఉపేందర్, నక్క ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

10 తేదీ వరకు అవకాశం

నడిగూడెం : ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్‌లో 2022– 23 విద్యాసంవత్సరం విద్యార్థులతో పాటు గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు వార్షిక పరీక్ష ఫీజును ఈ నెల10వ తేదీ వరకు చెల్లించవచ్చని నడిగూడెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ (ఏఐ) కోఆర్డినేటర్ మైనం శోభన్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఫీజు సబ్జెక్టుకు– 100, ఇంటర్మీడియట్ ఫీజు– 150ను మీసేవాలో చెల్లించి రసీదు పాఠశాలలో అందజేయాలని సూచించారు.

వివాహానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న నయీం

కోదాడఅర్బన్ : పట్టణానికి చెందిన పండ్ల వ్యాపారస్తుడి కుమార్తె రేష్మ వివాహానికి పట్టణ పండ్ల వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు షేక్ నయీం అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు రజియా, జానీ, అబ్బు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకోవాలి

మునగాల : మండల కేంద్రంలోని 446/1 సర్వే నెంబర్‌లో గల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, అధికారులు అడ్డుకట్ట వేయాలని గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు, రైతులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 446/1 సర్వే నెంబర్‌లో గతంలో చెరువు కాలువలు, పంట పొలాలకు దారి ఉండేదని కాలక్రమేణ ఈ భూమి కనుమరుగు కావడంతో కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టాలనే ఆలోచనలో వారు ఉన్నారని తెలిపారు. ఈ విషయమై గతంలో జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి సదరు భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

నేరేడుచర్ల : నేరేడుచర్ల నుంచి దాసారం వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారిందని, తక్షణమే ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను కోరారు. బుధవారం మండలంలోని కల్లూరులో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దాసారం, ముకుందాపురం, కల్లూరు, పెంచికల్‌దిన్న గ్రామాల నుంచి ప్రజలు, విద్యార్థులు నిత్యం ఈ రోడ్డు మార్గాన నేరేడుచర్లకు వచ్చి వెళ్తుంటారని, రోడ్డు అధ్వానంగా మారడంతో నరకయాతన పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నాగసైదులు, వెంకటేశ్వర్లు, శ్రీధర్, సైదులు, ధనుంజయ, సోమయ్య, సైదులు, రాములమ్మ, రాణెమ్మ తదితరులున్నారు.

'డబుల్ ఇళ్ల' జాబితాలో అనర్హుల పేర్లు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిపాల వేణు యాదవ్ అన్నారు. బుధవారం ఆయన చిలుకూరులో విలేకరులతో మాట్లాడారు. బేతవోలులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు గాను అధికారులు గుర్తించిన జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని, తక్షణమే మరోమారు విచారణ చేపట్టి అర్హుల జాబితా రూపొందించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులు చెప్పిన పేర్లు జాబితాలో చేర్చి అర్హత కలిగిన నిరుపేదల పేర్లు జాబితా నుంచి తొలగించారని ఆరోపించారు. మొదటి జాబితాలో ఉన్న పేదల పేర్లు తుది జాబితాలో లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేణు, నాయకులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు పంపిణీ

నేరేడుచర్ల : రాజీవ్‌గాంధీ బిల్డింగ్, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెయింటింగ్ కార్మికులకు బుధవారం గుర్తింపు కార్డులను ఆ యూనియన్ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ పంపిణీ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు సయ్యద్ ముస్తాఫా, జానయ్య, పున్నయ్య, మల్లయ్య, శ్రీరాములు, ఖరీముల్లా, నగేష్, వెంకటాచారి తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో మెరుగైన వసతులు

కోదాడఅర్బన్ : పేదలకు విద్య, వైద్యం అందించడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, దశలవారీగా అన్ని పాఠశాలల్లో ప్రభుత్వం మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మన బస్తీ– మన బడి పథకంలో భాగంగా అభివృద్ధి చేసిన కోదాడ పట్టణ పరిధిలోని సాలార్జింగ్‌పేట 9వ వార్డులోని ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. మన ఊరు– మన బడితో పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. తొలి దశలో నియోజకవర్గంలో 20 పాఠశాలలకు నిధులు కేటాయించి, అందులో రెండు పాఠశాలల్లో అన్ని పనులు పూర్తి చేసి నేడు లాంఛనంగా ప్రారంభించామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను కౌన్సిలర్ మధార్, ప్రధానోపాధ్యాయుడు రచ్చ మురళి, ఎస్‌ఎంసీ చైర్మన్ సమీనా, గ్రామ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ సలీం షరీఫ్, ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పద్మ, కమిషనర్ మహేశ్వరరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సాధిక్, ఎస్‌ఎంసీ చైర్మన్ సమీనా, కౌన్సిలర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులున్నారు.


సాలార్జింగ్ పేటలో ప్రాథమిక పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


సాలార్జింగ్‌పేట ప్రాథమిక పాఠశాలలో గతంలో శిథిలావస్థలో ఉన్న మూత్రశాలలు


నేడు నూతనంగా నిర్మించిన మూత్రశాలలు

రూ. 9.88 లక్షలతో ఆధునీకరణ..

మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన సాలార్జింగ్‌పేట ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రభుత్వం పాఠశాలను మన బస్తీ– మన బడి కింద ఎంపిక చేసి రూ.9 లక్షల 88 వేలు మంజూరు చేసింది. ఆ నిధులతో పాఠశాలలో ఉన్న మూడు గదుల వేర్వేరు భవనాలను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేశారు. అదేవిధంగా శిథిలావస్థలో ఉండి ఉపయోగంలో లేని మూత్రశాలలను ఆధునీకరించారు. పాఠశాలలో పెద్ద సంప్ నిర్మించి దానిని మిషన్ భగీరథ నీటితో నింపుతూ తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో పాటు బ్యాటరీ ట్యాప్‌లను ఏర్పాటు చేశారు. విద్యార్థులు భోజనానంతరం చేతులు కడుకునేందుకు, మంచినీరు తాగేందుకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పాఠశాల చుట్టూ ప్రహరీ ఎత్తును పెంచడంతో పాటు పాఠశాలలో బండలు వేశారు.పాఠశాల స్వరూపమే మారడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూపురేఖలు మార్చారు

మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన పాఠశాలలోని గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో పెచ్చులూడి పడ్డాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయంతో ఉండే వాళ్లం. మా పాఠశాలను మనబస్తీ – మనబడి పథకానికి ఎంపిక చేసి పాఠశాల రూపురేఖలు మార్చివేశారు. సదుపాయాలు కల్పించారు. ఇక ఉపాధ్యాయులు మరింత ఉత్సాహంగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తారు.

– రచ్చ మురళీకృష్ణ, హెచ్‌ఎం, ప్రాథమిక పాఠశాల

మిల్లులు తెరవాలని కార్మికుల ధర్నా


మిల్లు వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

హుజూర్‌నగర్ : పట్టణంలో అకారణంగా మూసివేసిన రెండు పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులను వెంటనే తెరవాలని కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు, కార్మికులు కోరారు. బుధవారం మూసివేసిన మిల్లు ఎదుట ప్లకార్డులతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిల్లులు మూసివేసిన కాలానికి కార్మికులకు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతర్గత సమస్యలతో మిల్లులను మూసివేసి వందలాది కుటుంబాల జీవనోపాధి దెబ్బతీయడం సరైనది కాదన్నారు. అనంతరం మిల్లు మిల్లు యజమానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు ఎం.నాగేశ్వరరావు, పి.ఉపేందర్, రోశపతి, అజయ్, జానయ్య, గురవయ్య, మల్లయ్య, పెదనాగేశ్వరరావు, వీరయ్య, సైదులు, కోటేశ్వరరావు, పటేల్, రాజు, ముఖేష్, పలువురు మహిళలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : ప్రభుత్వం అర్హులైన వారందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాలకూరి బాబు, జిల్లా నాయకుడు కోప్పోజు సూర్యనారాయణ కోరారు. ఈమేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సుధారాణికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని బూరుగడ్డలో 30 ఇళ్లు నిర్మించగా 41 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారని.. మిగిలిన 11మందికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. సీతారాంపురంలో ఇళ్లను పూర్తిచేసి అర్హులకు ఇవ్వాలని కోరారు. స్థలం ఉన్న వారికి ఇండ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అనంతు వీరబాబు, చింతకాయల కనకయ్య, గందసిరి గురవయ్య, రవి, వెంకన్న, మేడిపల్లి శ్రీనివాసు, కొమ్ము క్రిష్ణ, సైదులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేస్తా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నూకల పద్మారెడ్డి

కోదాడఅర్బన్ : కోదాడ నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, రెడ్డి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నూకల పద్మారెడ్డి అన్నారు. బుధవారం కోదాడలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు ఇక నుంచి తాను కోదాడలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పట్టణం, గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ తామవిగా చెప్పుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టించి లబ్ధి పొందుతున్నాడని ఆరోపించారు. వర్గ విభేదాలు ఏ పార్టీలోనైనా సహజమని, వాటిని అధికమించి అందరిని కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు. నియోజవర్గ పరిధిలోని మోతె మండలం సిరికొండ తన మెట్టినిల్లని, ఆ సంబంధ, బాంధవ్యాలతో పార్టీని నియోజకవర్గంలో పటిష్ట పరుస్తానన్నారు. పార్టీ టికెట్ ఎవరికి అనేది అధిష్టానం చూస్తుందని, పదవుల కోసం తాను రాలేదని, పార్టీ అభివృద్ధికి వచ్చానన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నకిరికంటి జగన్‌మోహన్‌రావు, పట్టణ ప్రధాన కార్యదర్శులు ఏపూరి గణేష్, దగ్గి వెంకటేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు కోటకొమ్ముల భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా లింగమంతులస్వామి జాతర


పూజలు చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య, తదితరులు


ఆలయానికి కలశం తీసుకెళ్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ దంపతులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై గల బోడి గుట్టపై లింగమంతులస్వామి ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ వేద పండితులు కొంకపాక రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ దంపతులు పాల్గొని ముత్యాలమ్మ విగ్రహానికి అభిషేకం చేశారు. అలాగే కలశ స్థాపన చేశారు. అనంతరం చండీ హోమం నిర్వహించారు. అదేవిధంగా మహిళలు పెద్దఎత్తున సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వందలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లం మాట్లాడుతూ సమాజ సుభిక్షతకు మన సాంప్రదాయ ఆలయాలు పట్టుకొమ్మలన్నారు. కాగా నాగార్జునసాగర్, తుంగతుర్తి ఎమ్మెల్యేలు నోముల భగత్, గాదరి కిశోర్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక, మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, పుర ప్రముఖులు పాల్గొని దైవ దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ సీఐ బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్, జె.శ్రీనివాసశర్మ, మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి ఉత్సవాలను దగ్గరుండి పర్యవేక్షించారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి

బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనే దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. బోడిగుట్టపై జీర్ణోద్ధరణ చేసిన లింగమంతుల స్వామి ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లింగమంతుల స్వామి ఆలయ పునర్నిర్మాణంలో కోదాడ ఎమ్మెల్యే పాత్ర కీలకమన్నారు. దేవాలయాల ద్వారానే ఆధ్యాత్మికత పెంపొంది సమాజం సన్మార్గంలో నడుస్తుందన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ ప్రారంభం


దిర్శించర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నర్సయ్య

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల, చింతకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యడవల్లి సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. దిర్శించర్ల పాఠశాలకు జెడ్పీటీసీ నర్సయ్య రూ.5వేలు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వారాల కిరణ్మయి రూ.5వేలు, చింతకుంట్ల పాఠశాలకు ఆర్‌ఎంపీ ఉపేందర్ రూ.10వేలు అందించారని వాటితో విద్యార్థులకు పరీక్షలు పూర్తయ్యేంత వరకు అల్పాహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, లయన్స్ క్లబ్ సభ్యులు చల్లా ప్రభాకర్‌రెడ్డి, జిలకర రామస్వామి, శ్రీనివాస్‌రావు, సూర్యనారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రామకృష్ణ, విశ్వనాథ్‌ధ్, రంగారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీనివాస్, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, యాదగిరి, కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

'రాయబారాన్ని' జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : సీఐటీయూ పిలుపు మేరకు ఈ నెల 7న కార్మిక శాఖ మంత్రి ఇంటికి నిర్వహించే రాయబారం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్య కోరారు. బుధవారం ఆ సంఘం పట్టణ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ శిల్ప కళా బిల్డింగ్ వర్కర్స్ (సీఐటీయూ) యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక శాఖ మంత్రి చామకూరి మల్లారెడ్డి అసెంబ్లీ సాక్షిగా భవన నిర్మాణ కార్మికులకు లక్ష మోటార్ సైకిళ్లు ఇస్తామని హామీ ఇచ్చారని కానీ నేటివరకు ఒక్కరికి కూడా మంజూరు చేయలేదని అన్నారు. సమావేశంలో ఆ సంఘ నాయకులు వి.వెంకన్న, టి.రాములు, ముస్తఫా, నరేష్, వేణు, నాగులు మీరా, శాంతయ్య, మల్లేశ్వరరావు, రాములు, రామకృష్ణ ఆనందరావు శ్రీను, పద్మ, అలివేలు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శం


మోతె : నామవరంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

మోతె : రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం అమలు చేస్తున్న కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శమని ఎంపీపీ ముప్పాని ఆశ, జెడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నామవరం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ హరిసింగ్‌నాయక్, సర్పంచ్ తండు యాదమ్మమల్సూర్, ఎంపీటీసీ పున్నమ్మ, పాండవుల కృష్ణ, వార్డు సభ్యులు, డాక్టర్ నాగరాజు, పీహెచ్‌ఎస్ సీత, సూపర్‌వైజర్ కమలమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచరు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అసంక్రమిత వ్యాధుల నివారణ జిల్లా అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో కంటి వెలుగు శిబిరాలను ఆయన పరిశీలించి, అక్కడి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా శిబిరాలను మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్లు పుష్ప, సృజన, సుష్మ, కంటి నిపుణురాలు మల్లిక, స్వాతి, కౌన్సిలర్ రామ్‌గోపి, భాస్కర్, హెచ్‌ఈఓ ప్రభాకర్, రామకృష్ణ, ఆశ కార్యకర్తలు, మెప్మా అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' శిబిరం పరిశీలన

మఠంపల్లి : మండలంలోని ప్రజలు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్, జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్ కోరారు. బుధవారం మఠంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో కంటి వెలుగు శిబిరాన్ని వారు సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జానకిరాములు, స్పెషల్ డాక్టర్ నాగేందర్, డాక్టర్.సుధాకర్‌నాయక్, అంగన్‌వాడీలు, ఆశలు ఉన్నారు.

మోదీ పాలన దేశానికి శ్రీరామరక్ష

హుజూర్‌నగర్ : ప్రధాని నరేంద్ర మోదీ పాలన దేశానికి శ్రీరామరక్ష అని బీజేపీ అసెంబ్లీ పాలక్ దాసరి మల్లేశం అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనతో ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని అన్నారు. ఈ నెల 3, 4, 5 తేదీలలో పార్టీ మండల కార్యవర్గ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, నాయకులు రామరాజు, సతీష్, గోపి, మురళి, ఉమామహేశ్వరరావు, ఉపేందర్, నర్సింహారావు, శంభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఉత్తమ్ గృహ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్మించనున్న నూతన గృహానికి బుధవారం ఎంపీ సతీమణి మాజీ ఎమ్మెల్యే పద్మావతి భూమి పూజ, శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని తహసీల్దార్‌కు వినతి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో గల ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ బుధవారం స్థానిక మహిళలు తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సొంత ఇళ్లు లేక, కిరాయి చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళలు లక్ష్మి, సైదాబీ, జుబేదా, అలివేలు, మీరాబీ, షరీఫా, గౌసియా, ఫర్వీన్, హుస్సేన్‌బీ, ఖాజాబీ, ఫాతిమా, నాయకులు వాస పుల్లయ్య, కరుణాకర్ తదితరులున్నారు.

క్రీడలతో పెంపొందనున్న స్నేహభావం


నల్లబండగూడెంలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న బెంజిమెన్

కోదాడరూరల్ : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బీఆర్‌ఎస్ నాయకుడు యరమాల బెంజిమెన్ అన్నారు. మండలంలోని నల్లబండగూడెంలో చిన్నగట్టు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్లగొండ, కృష్ణా జిల్లాల క్రికెట్, కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యరమాల క్రాంతికుమార్, ఆలయ చైర్మన్ లింగయ్య, శరబేశ్వరరావు, ముంద్రా రంగారావు, ప్రగడ వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, గోపినాథ్, గోపి, సురేష్, మల్లిఖార్జున్ ఉన్నారు.

భోజనశాల నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని షిరిడి సాయిబాబా మందిరంలో భోజనశాల నిర్మాణానికి వందనపు కృష్ణమూర్తి– పద్మావతి దంపతులు బుధవారం రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, ట్రస్ట్ కమిటీ సభ్యుడు బుస్సా మహేష్, పూజారి రాజశేఖరశర్మ తదితరులు ఉన్నారు.

ప్రమాద బీమాపై అవగాహన

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ ప్రమాద బీమా చేయించుకోవాలని నేరేడుచర్ల ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ ఫణికుమార్, ఆర్‌ఎం కృష్ణమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని వైకుంఠాపురంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ప్రమాద బీమాపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. రూ. 12 నుంచి రూ.వెయ్యి వరకు ప్రమాద బీమా (యాక్సిడెంట్ పాలసీ) చేయించుకుంటే ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలతో రూ.4 లక్షల వరకు ప్రయోజనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్, కర్రి సతీష్‌రెడ్డి, నాగార్జున తదితరులున్నారు.

శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ వేణుగోపాల సీతారామచంద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఆలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. విశ్వక్సేన ఆరాధన, కంకణధారణ, దీక్షాధారణ, ఆలయ ప్రదక్షణ తదితర క్రతువులను వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి, అర్చకులు, స్నానాచార్యులు, భక్తులు, పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేయించుకోవాలి

కోదాడరూరల్ : రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి పి.రజిని సూచించారు. బుధవారం మండల పరిధిలోని తమ్మరలో వరి సాగును పరిశీలించి, పంటల నమోదుపై రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. వరి పంటకు ఆశించే మొగిపురుగు, అగ్గితెగులు వంటి తెగుళ్ల నివారణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. యూరి యాను తక్కువ మోతాదులో చల్లుకోవాలని నత్రజని ఎక్కువైతే తెగుళ్లు విజృంభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ చాందిబీ, రైతులు ఉన్నారు.

సమస్యలపై పోరాడుదాం

గరిడేపల్లి : భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడేందుకు ప్రతి కార్మికుడు సిద్ధంగా ఉండాలని తెలంగాణ ప్రగతి శీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ అన్నారు. బుధవారం మండలంలోని కలమ్మలచెరువు, కీతవారిగూడెం, గడ్డిపల్లి గ్రామాల్లో జరిగిన ఐఎఫ్‌టీయూ సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు విక్రం, సైదులు, ఖాసీం, రామయ్య, వీరయ్య, శ్రీను, నర్సింహరావు, రమేష్, మస్తాన్, గంగయ్య, వెంకటేశ్వర్లు, అమీనా తదితరులున్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నేరేడుచర్ల : రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, సర్పంచ్ మాధవి అన్నారు. బుధవారం మండలంలోని దిర్శించర్లలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పశువైద్యాధికారి రవినాయక్ మాట్లాడుతూ ఈ శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సతో పాటు 25 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమలలో పశువైద్యులు నాగేంద్ర, సురేష్, సిబ్బంది నర్సింహచారి, సబేరా, భాస్కర్, గోపాల మిత్రలు రామయ్య, సైదులు, భుజంగరావు, గౌరెల కాపర్ల సంఘం అధ్యక్షుడు పార్తనబోయిన సైదులు తదితరులున్నారు.

'ఆయుష్మాన్ భారత్' పథకంపై రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని నర్సయ్యగూడెం, రాంపురంలలో ఆయుష్మాన్ భారత్ పథకంపై అవగాహన కల్పించారు. అర్హులైన వారికి ఈ– కేవైసీ చేయించారు. కేంద్ర ప్రభుత్వం 2018 లోనే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టినా తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడంలో కాలయాపన చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్వాల వెంకటేశ్వర్లు, నాయకులు రామ్మూర్తి, అశోక్, నాగిరెడ్డి, రాజేష్‌రెడ్డి, సైదులు, నరేందర్‌రెడ్డి, పరమేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, సురేష్ తదితరులున్నారు.

చింతలపాలెంలో ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన


ధ్వజస్థంభం ప్రతిష్ఠిస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామచంద్రస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల విగ్రహాలను, జీవధ్వజ స్థంభాన్ని వేదమంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. అనంతరం దాతల సహకారంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మావతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు, పలువురు ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని సీఎం

నేరేడుచర్ల : మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కొండపల్లి వరలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆమె నేరేడుచర్లలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా మధ్యాహ్న భోజనం కార్మికులకు గౌరవ వేతనం పెంచుతామని చెప్పి నేటికీ ఆ హామీలను అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకురాళ్లు సీహెచ్ మంగమ్మ, ధనమ్మ, రుద్రమ్మ, ముత్తమ్మ, తిరుపతమ్మ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

నోటీస్ అందజేత

హుజూర్‌నగర్ : రైస్‌మిల్ డ్రైవర్ల జీతాలను పెంచాలని కోరుతూ రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులకు బుధవారం యూనియన్ నాయకులు నోటీస్ అందజేశారు. వివిధ కార్మిక, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మడేలేశ్వరస్వామి జయంతి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు గూడెపు నాగలింగం ఆధ్వర్యంలో రజక కుల దైవమైన మడేలేశ్వరస్వామి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గూడెపు అంజయ్య, గురవయ్య, మట్టయ్య, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ చైర్లు అందజేత

హుజూర్‌నగర్ : గ్రూప్ –1 ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయిన పది మంది అభ్యర్థులకు హుజూర్‌నగర్ గ్రంథాలయ చైర్మన్ పిన్నని సంపత్ బుధవారం సుమారు రూ.10 వేల విలువ గల స్టడీ చైర్‌లను అందజేశారు.